# శనార్తి తెలంగాణ

telanganarajyadhikaraparty.in

సంపుటి : 05 | సంచిక : 151 (కాంప్లిమెంటరీ కాపీ) | ఎడిటర్ : తీన్మార్ మల్లన్న | శనివారం 10-01-2026 | పేజీలు : 4


## అమెరికా, ఇజ్రాయిల్‌లు బెదిరింపులు మానుకోవాలి

- ఆ దేశాలు ఇరాన్ పట్ల వ్యవహరిస్తున్న తీరు సరికాదు
- యూఎస్, ఇజ్రాయిల్ హెచ్చరికలను మేం ఖాతర్ చేయం
- ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యాన్ని సహించం
- యూఎస్ ఇబ్బంది పెడితే మేం యుద్ధానికి సిద్ధమే
- త్వరలోనే టెహ్రాన్‌లో పరిస్థితులు చక్కబడతాయి
- అల్లర్లు అదుపులోకి వస్తున్నాయి
- ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రి అబ్బాస్

2 లో





జగదీశ్ రెడ్డి అరాచకాలు తట్టుకోలేకపోయా

# ఎస్టీ బిడ్డగా అవమానాలెదుర్కొన్న

## అగ్రకుల పార్టీల నుంచి బీసీలందరూ బయటకు రావాలే

- 18 ఏళ్ల పాటు బీఆర్ఎస్‌కు సేవ చేశా
- ఆ పార్టీలో అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని భరించలేకపోయా
- అందుకే ఆ పార్టీ నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్న
- టీఆర్పీతోనే బీసీ రాజ్యాధికారం సాధ్యం
- బీసీ ఉద్యమ ఆశాజ్యోతి తీన్మార్ మల్లన్న
- ఇక నుంచి మల్లన్న నాయకత్వంలో పని చేస్తాం
- యాదాద్రి–భువనగిరి తాజా మాజీ జడ్పీ వైస్ ఛైర్మెన్ బీకు నాయక్
- బీఆర్ఎస్ పార్టీకి బీకు నాయక్ గుడ్ బై
- ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా..!

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీలో సామాజిక న్యాయం కరువైందని.. తానొక ఎస్టీ బిడ్డగా ఆ పార్టీలో ఎన్నో బాధలు అనుభవించానని అందుకే భారాసలో ఉండడం ఇష్టం లేకే పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు యాదాద్రి–భువనగిరి జిల్లా పరిషత్ తాజా మాజీ వైస్ ఛైర్మెన్ బీకు నాయక్ స్పష్టం చేశారు. ఇక నుంచి బీసీ వర్గాల ప్రజా గొంతుక, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు, శాసన మండలి సభ్యులు తీన్మార్ మల్లన్న అడుగు జాడల్లో నడవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత తొలిసారి శుక్రవారం బీకు నాయక్ మీడియా సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం తానెంతో కృషి చేసినట్లు వివరించారు. తరువాయి 2లో...

# మీరు సహకరిస్తే.. మేమూ సహకరిస్తాం..

- నీళ్ల విషయంలో రాజకీయ లబ్ధి చూడొద్దు
- మాకు వివాదాలు కాదు.. పరిష్కారాలే ముఖ్యం
- తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవద్దు
- మేమూ పక్క రాష్ట్రాల ప్రాజెక్టులకు సహకరిస్తాం
- ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులతో పరస్పర సహకారాన్ని కోరుకుంటున్నాం
- పొరుగు రాష్ట్రాలతో చర్చలకు సిద్దంగా ఉన్నాం
- రేపటి భవిష్యత్ నగరమే.. ఫ్యూచర్ సిటీ ..
- రావిర్యాల ఈ సిటీ సభలో సీఎం రేవంత్ రెడ్డి



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** "నదీ జలాల విషయంలో మాకు పంచాయతీలు కాదు.. నీళ్లు కావాలి. వివాదాలు కాదు.. పరిష్కారాలు కావాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రాలతో తాము సఖ్యతనే కోరుకుంటున్నామని, ఒకరికొకరు సహకరించుకుంటేనే అభివృద్ధి సాధ్యమని, తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవద్దని సూచించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని ఈ–సిటీలో నెలకొల్పిన సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.... తరువాయి 2లో...



## రియల్ ఎస్టేట్ బ్రోకర్ చేతిలో రాష్ట్రం

- యూనివర్సిటీ భూములపై రేవంత్ సర్కార్ విరుచుకుపడుతుంది
- ఉర్దూ యూనివర్సిటీని నిర్వీర్యం చేసే కుట్రలు
- మనూ భూముల కోసం విద్యార్థులకు అండగా ఉంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నిరుద్యోగులపై లాఠీచార్జిని ఖండన
- యువతకు బీఆర్ఎస్ మద్దతుంటుందని వెల్లడి

2 లో



## అన్నదాతలు ఆగమవుతున్నారు

### కాంగ్రెస్ సర్కార్ వారిని పట్టించుకోవడం లేదు

- రేవంత్ దేవుళ్ల మీద ఒట్టేసి సగం మందికి,కూడా రుణమాఫీ చేయలేకపోయారు
- ఒక్క సిద్దిపేట నియోజకవర్గంలోనే, 22 వేల మంది రైతులకు రుణమాఫీ కాలే
- కేసీఆర్ సర్కార్ రైతులకు ఎంతో చేసింది
- కరోనా టైంలోనూ రైతు బంధు ఆపలే,కానీ,ఇప్పటి పరిస్థితులు వేరు
- రైతు బంధే కాదు.. కరెంటూ సరిగ్గా ఇవ్వడం లేదు
- మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్ రావు

2 లో



## బీజేపీ అంటే భ్రష్ట జనతా పార్టీ

- అభివృద్ధి పేరుతో దోపిడీ వ్యవస్థ నడుస్తోంది
- డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు అభివృద్ధిలో విఫలం
- బిలియనీర్ల కోసమే ప్రభుత్వాలను నడుపుతుండ్రు
- ఆరావళి పర్వతాలను ధ్వంసం చేస్తున్నారు
- అంకితా భండారీ కేసు నిందితులను రక్షిస్తున్నదెవరు.?
- అందరికీ సమన్యాయం ఎప్పుడు దక్కుతుంది?
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

2 లో

# ఉన్నవి మూడే కమిటీలు..!?

## కీలక కమిటీలు కోలాప్స్..!?

## ఏవోబీలో అడ్రస్ గల్లంతు..!

### డీకేలో బెటాలియన్-1 కనుమరుగు..!

ఉనికిని చాటుకుంటున్న ఒడిశా–జార్ఖండ్–బెంగాల్

సరిహద్దు, జార్ఖండ్, బీహార్ రాష్ట్ర కమిటీలు..!?

అయినా ఇక్కడా యాక్టివిటీస్ అంతంతే..!



**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** మావోయిస్టు పార్టీవి దింపుడుగల్లం ఆశలా కనిపిస్తోంది. గత కొంత కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను బట్టి ఆ పార్టీ దాదాపు కోలాప్స్ అయ్యే దశకే వచ్చేసినట్లు అనిపిస్తోంది. ఒకప్పుడు మావోయిస్టు పార్టీ భారత ప్రభుత్వానికి కొరకరాని కొయ్య. మధ్య భారతంలోని దండకారణ్యంలో జనతన సర్కార్ పేరిట సమాంతర ప్రభుత్వాన్నే నడిపింది. అప్పట్లో డీకే వైపు చూసేందుకే సీఆర్పీఎఫ్, ఆయా రాష్ట్రాల పోలీసులు జడుసుకునేటోళ్లు. కానీ, గత ఏడాదిన్నర కాలంలో మధ్య భారతంలోని దాదాపు అన్ని ప్రాంతాలపై బలగాలు అప్పర్ హ్యాండ్ సాధించాయి. కీలక ప్రాంతాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. ఈ నేపథ్యంలోనే దండకారణ్యం, ఏవోబీ వంటి ఏరియాల్లో మావోయిస్టు పార్టీకి ఉనికి లేకుండా పోయింది. ఏవోబీలోనైతే గాజర్ల సారయ్య ఎన్‌కౌంటర్ తర్వాత అక్కడ పార్టీ అసలు ఉనికిలోనే లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. డీకేలో నంబాలతో పాటు పలువురు కేంద్ర కమిటీ సభ్యుల వరుస ఎన్‌కౌంటర్ల తర్వాత అక్కడ పార్టీ ఉనికే కష్టంగా మారింది. ఈ నేపథ్యంలోనే దండకారణ్యం, ఏవోబీలో బలంగా ఉన్న పార్టీ కూకటి వేళ్లు దాదాపు తెగిపోయాయి. తరువాయి 2లో...

## పౌరసత్వం పాక్‌ది..!

- ఉద్యోగం ఇండియాలో..!
- 30 ఏళ్ల తర్వాత బయట పడ్డ మహిళా ఉద్యోగి అసలు రంగు..!
- ఫర్జానాపై యూపీ పోలీసుల కేసు
- కొనసాగుతున్న దర్యాప్తు

2 లో





# మల్లన్నపై అనుచిత వ్యాఖ్యలను సహించం


### కవిత గురించి మల్లన్న వాస్తవాలు మాట్లాడుతుండు

### ఓర్వలేక ఆమె నీచ రాజకీయాలకు పాల్పడుతుంది

### ఫెయిడ్ బ్యాచ్‌తో అనుచిత వ్యాఖ్యలు చేయిస్తుంది

### ఇష్టానుసారం మాట్లాడితే తగిన బుద్ధి చెప్తాం

- పదేళ్లు దోచుకొని మళ్ళీ ఓట్ల కోసం జనం బాటనా,పూటకో వేషంతో నాటకాలు ఆడుతున్నది
- టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి పండాల్, రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్
- మల్లన్నపై కవిత అనుచరుల వ్యాఖ్యలు సిగ్గుచేటు
- టీఆర్పీసిద్ధిపేట జిల్లా అధ్యక్షులు తుప్పతి బిక్షపతి కురుమ





**శనార్తి తెలంగాణ, సంగారెడ్డి /మెదక్, సిద్దిపేట :** టీఆర్పీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై జాగృతి ఫెయిడ్ బ్యాచ్ చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను సహించబోమని టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి పండాల్, రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.... కల్వకుంట్ల కవిత గురించి మల్లన్న నిజాలు మాట్లాడుతుంటే వారికి ఎందుకు కోపం వస్తోందని ప్రశ్నించారు. వాస్తవాలను భరించలేక ఫెయిడ్ బ్యాచ్‌తో మల్లన్నపై అనుచిత వ్యాఖ్యలు చేయించడం కవితకు తగదని అన్నారు. కవిత కులానికి చెందిన జనాభా రెండు లక్షలు కూడా ఉండరని, తరువాయి 2లో...

## ఉక్రెయిన్‌పై ఒరెష్నిక్ ప్రయోగం.!

### ఉక్రెయిన్ పై డ్రోన్లు, క్షిపణులతో రష్యా దాడులు

- భూగర్భ సహజ వాయువు నిల్వలపై దాడి
- పుతిన్ నివాసంపై దాడులకు ప్రతీకారం
- రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటన
- 36 క్షిపణలు,242 డ్రోన్లను ప్రయోగించిన ఉక్రెయిన్
- నలుగురు మృతి, 22 మందికి గాయాలైనట్లు వెల్లడి
- ఉక్రెయిన్,రష్యా వార్ ఇంకా ముదురే ఛాన్స్

**శనార్తి తెలంగాణ,ఇంటర్ నెట్ డెస్కు :** రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఊహించని మలుపు తిరిగింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ డ్రోన్ దాడులు చేసిందన్న ఆరోపణల నేపథ్యంలో మాస్కో అత్యంత భయంకరమైన ప్రతీకార చర్యకు దిగింది. ప్రపంచ దేశాలను వణికిస్తున్న తన అత్యాధునిక హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణి 'ఒరెష్నిక్'ను ఉక్రెయిన్‌పై ప్రయోగించి విలయం సృష్టించింది. పశ్చిమ ఉక్రెయిన్‌లోని లివివ్ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని రష్యా ఈ దాడి నిర్వహించింది.ధ్వని వేగం కంటే 10 రెట్లు వేగంతో దూసుకెళ్లే ఈ క్షిపణి, లివివ్‌లోని వ్యూహాత్మక భూగర్భ సహజ వాయువు నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. గత నెలలో నొవోగొరాడ్ ప్రాంతంలోని పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ 91 డ్రోన్లతో దాడులు చేసిందని, తరువాయి 2లో...

# మల్లన్నపై అనుచిత వ్యాఖ్యలను సహించం

**మొదటిపేజీ తరువాయి...**

కానీ బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. ఇప్పుడు మళ్ళీ ఓట్ల కోసం 'జనం బాట' అంటూ పూటకో వేషం వేస్తూ నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ స్కామ్ చేసి జైలుకు వెళ్లి వచ్చిన కవితకు.. సొంత తండ్రి, అన్న, బావలపై వ్యాఖ్యలు చేసే నైతిక హక్కు ఎక్కడుందని ప్రశ్నించారు. తీన్మార్ మల్లన్న ప్రతి ఆడబిడ్డను అక్కగా, చెల్లెమ్మగా, అమ్మగా గౌరవిస్తారని అన్నారు. పార్టీలో మహిళలకు అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తున్నారని, ఆయనకు మహిళల పట్ల ఉన్న గౌరవం అందరికీ తెలిసిందేని అన్నారు. జిల్లా వ్యాప్తంగా సర్పంచ్ ఎన్నికల ప్రచారానికి వెళ్తే ప్రతి ఊర్లో ప్రజలు మల్లన్నను తమ ఊరికి తీసుకురమ్మని కోరుతున్నారని, ఆయన గ్రామాల పర్యటన చేస్తే బీసీలంతా అండగా నిలవడం ఖాయమని అన్నారు. బీసీలకు రాజ్యాధికారం దక్కాలని అలుపెరుగని పోరాటం చేస్తున్న మల్లన్నపై దాడి చేస్తామని జాగృతి బ్యాచ్ బహిరంగంగా బెదిరిస్తే, మేమేమీ చేతికి గాజులు వేసుకొని కూర్చోలేదని, తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్



ఉమ్మడి జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జ్ శ్రీకాంత్, ఉమ్మడి మెదక్ జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జ్ హర్ష, జహీరాబాద్ మండల అధ్యక్షుడు రాకేష్, ఝరాసంగం మండల అధ్యక్షుడు సంగమేష్, మొగుడంపల్లి మండల సోషల్ మీడియా ఇన్చార్జ్ వీరేశం, మహేష్, నర్సింలు, శేఖర్ మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**మల్లన్నపై కవిత అనుచరుల వ్యాఖ్యలు సిగ్గుచేటు**
**టీఆర్పీసిద్దిపేట జిల్లా అధ్యక్షులు తుప్పతి బిక్షపతి కురుమ**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై జాగృతి అధ్యక్షురాలు కవిత అనుచరులు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తుప్పతి బిక్షపతి కురుమ అన్నారు. బహుజనులకు రాజ్యాధికారం దిశగా తీర్మానం మల్లన్న ఉద్యమం చేస్తున్నాడని, అలాంటి వ్యక్తిపై కవిత అనుచరులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో టీఆర్పి జిల్లా ఉపాధ్యక్షులు నర్సింగ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు తుప్పది శ్వేత లతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తుప్పతి బిక్షపతి కురుమ మాట్లాడుతూ... కేసీఆర్ కవితను బీఆర్ఎస్ నుంచి ఎందుకు వేలేశారో అందరికీ తెలుసని అన్నారు. తీన్మార్ మల్లన్న అంటే ఒక వ్యక్తి కాదని బీసీ ఉద్యమ శక్తి అని, అగ్రవర్ణ రాజకీయాలకు చెక్ పెట్టి దిశగా మల్లన్న అడుగులు వేయడం అగ్రవర్ణ రాజకీయ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాధికారం రావాలని ఉద్దేశంతో తీన్మార్ మల్లన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీని స్థాపించినట్టు తెలిపారు. పార్టీలో వేలాది మంది చేరికలు జరుగుతున్నాయని, రాష్ట్ర నలుమూలల నుంచి ఉప్పొంగుతున్న బీసీ చైతన్యాన్ని ఇక ఎవరు ఆపలేరని, గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. బహుజనులకు రాజకీయాల్లో నిజమైన ప్రాతినిధ్యం, అధికారంలో భాగస్వామ్యం కల్పించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ లక్ష్యం అని పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న పై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. మల్లన్న వెనుక ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీలు అందరూ ఏకమై ఉన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీదే అధికారంమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగ ఉపాధ్యక్షుడు మల్కి సంపత్ కుమార్, మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ బాబా, పరశురాము తదితరులు పాల్గొన్నారు.




# టీవీకే చీఫ్ విజయ్‌కి మద్రాస్ హైకోర్ట్ షాక్

- జన నాయగన్ సినిమా యూనిట్‌కు, డివిజన్ బెంచ్‌లో ఎదురు దెబ్బ
- యూ/ఏ సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వాలని తీర్పు,ఇచ్చిన సింగిల్ జడ్జి తీర్పుపై స్టే
- కేసు విచారణ ఈనెల 21కి వాయిదా

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** ప్రముఖ తమిళ నటుడు, టీవీకే పార్టీ అధినేతకు మద్రాస్ హైకోర్ట్ షాక్ ఇచ్చింది. జన నాయగన్ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని మద్రాస్ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై శుక్రవారం డివిజన్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును నిలుపుదల చేస్తూ.. డివిజన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది. తదుపరి వాదనలు ఏమైనా ఉంటే అదే రోజు వింటామని కోర్టు స్పష్టం చేసింది. వాస్తవానికి జన నాయగన్ మూవీ నిన్న విడుదల కావాల్సి ఉంది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు మేరకు శుక్రవారం సినిమా రిలీజ్ కావాల్సి ఉండగా..డ ివిజన్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో...సినిమా విడుదలకు బ్రేక్ పడినట్లైంది.

# అన్నదాతలు ఆగమవుతున్నారు



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అధ్వాన పాలనతో అన్నదాతలు ఆగమాగమవుతు న్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసన సభ్యులు తన్నీరు హరీశ్ రావు అన్నారు. రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టు పెట్టి చెప్పినా సగం మందికి కూడా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. సిద్దిపేట నియోజకవర్గంలోనే 22 వేల మంది రైతులకు ఇప్పటికీ రుణమాఫీ కాలేదని తెలిపారు. రేవంత్‌రెడ్డి ఫ్యాక్టరీ ప్రారంభించడానికి సిద్దిపేటకు వస్తే, ఆ 22 వేల మంది రైతులతో కలిసి వచ్చి రుణమాఫీ కావాలని అడుగుతానని స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని శుక్రవారం హరీశ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ చేతగానితనం వల్ల అన్నదాతలు ఆగం కావల్సిన పరిస్థితులు దాపురించాయన్నారు. కాంగ్రెస్ సర్కార్ రైతులను పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టిందని, కరోనా వంటి కష్టకాలంలోనూ రైతు బంధు ఆపలేదని గుర్తుచేశారు. రైతులకు నీళ్ల బాధ లేకుండా చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌కే దక్కుతుందని చెప్పారు. కేసీఆర్ హయాంలో ఎరువుల కొరత లేకుండా వ్యవసాయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని హరీశ్‌రావు అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో వ్యవస్థ అస్తవ్యస్తమైందని, రైతులకు 12 గంటలకు మించి కరెంట్ కూడా రావడం లేదని విమర్శించారు. యూరియా కోసం యాప్‌లు పెట్టి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. వానకాలం పంటకు సంబంధించి 600 కోట్ల బోనస్‌ను పెండింగ్‌లో పెట్టారని తెలిపారు. రెండేళ్లలో ఒక్క రూపాయి కూడా పంటల బీమా ఇవ్వలేదని, రైతులపై కావాలనే కక్షగట్టి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. కేసీఆర్ కట్టిన వాటిని కత్తిరిస్తూ ఉన్న పనులను కూడా ఆపేస్తున్నారని మండిపడ్డారు.

# మీరు సహకరిస్తే.. మేమూ సహకరిస్తాం..

**మొదటిపేజీ తరువాయి...**

రాజకీయ ప్రయోజనాల కోసం నీటి అంశాన్ని వాడుకోవద్దని సూచించారు. "కృష్ణా నదిపై మంజూరైన పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్బీసీ, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డంకులు సృష్టించవద్దు. అభ్యంతరాల వల్ల పర్యావరణ, సీడబ్ల్యూసీ అనుమతులు రాక రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక అడుగు ముందుకు వేస్తే, తాము పది అడుగులు ముందుకు వేస్తామని, పరస్పర సహకారంతో సమస్యలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతో సత్సంబంధాలను కోరుకుంటున్నట్లు సీఎం తెలిపారు. "ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి చెందాలని మేము కోరుకుంటున్నాం. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ కావాలన్నా పక్క రాష్ట్రాల సహకారం అవసరం. మీరు సహకరిస్తే.. మేమూ సహకరిస్తాం" అని ఆయన వివరించారు. నీటి వాటా విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, అది వివాదాల ద్వారా కాకుండా చర్చల ద్వారా సాధించుకోవాలని అన్నారు.

హైదరాబాద్ నగరం గత 30 ఏళ్ల శ్రమతో ప్రపంచ నగరాలతో పోటీ పడుతోందని రేవంత్ రెడ్డి కొనియాడారు. "రేపటి భవిష్యత్ నగరమే 'ఫ్యూచర్ సిటీ'. దీని వల్ల ఈ ప్రాంతంలో భూముల ధరలు అమాంతం పెరుగుతాయి. పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుంది" అని భరోసా ఇచ్చారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు లక్ష్యాలతో అభివృద్ధి చేస్తున్నామని, 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌తో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఫార్మా రంగంలో ప్రపంచమే హైదరాబాద్ వైపు చూస్తోందని, పాలసీ పక్షపాతం లేకుండా పారదర్శకమైన విధానాలు రూపొందిస్తున్నామని సీఎం వెల్లడించారు. ఇన్వెస్టర్లకు రక్షణ, ఫార్మా రంగంలో ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తదని అన్నారు. ఫ్యూచర్ సిటీతో భూముల విలువ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

# బీజేపీ అంటే భ్రష్ట జనతా పార్టీ



**శనార్తి తెలంగాణ, న్యూఢిల్లీ :** బీజేపీని 'భ్రష్ట జనతా పార్టీ' (అవినీతి పార్టీ)గా అభివర్ణిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై, బీజేపీ పాలిత రాష్ట్రాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల ఏలుబడిలో దేశవ్యాప్తంగా అవినీతి, అధికార దుర్వినియోగం పెచ్చరిల్లిందని, ఇది సామాన్య ప్రజల జీవితాలను చిదిమేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఉత్తరాఖండ్‌ను కుదిపేసిన అంకితా భండారీ హత్య కేసును ప్రస్తావిస్తూ.. "అధికారంలో ఉన్న ఏ బీజేపీ వీఐపీ నిందితులను రక్షిస్తున్నారు? బాధితులకు సమన్యాయం ఎప్పుడు దక్కుతుంది?" అని రాహుల్ నిలదీశారు. ఉత్తర్ ప్రదేశ్‌లో ఉన్నావ్ రేప్ కేసు నిందితులకు కూడా ప్రభుత్వం రక్షణ కల్పిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎలుకలు కొరికి శిశువులు మరణించడం, కలుషిత నీరు, గాలితో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధ్యతారాహిత్యం కాదని, అవినీతి వల్ల తలెత్తిన భయంకర పర్యావసనాలేనని విమర్శించారు. ప్రధాని మోదీ కేవలం బిలియనీర్ల కోసమే డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. "బిలియనీర్ల కళ్లు పడగానే రాజస్థాన్‌లోని ఆరావళి పర్వతాల దగ్గర నిబంధనలు మారిపోయాయి. ప్రకృతి సంపదను దోచుకోవడానికి పర్వతాలను ధ్వంసం చేస్తున్నారు, అడవులను నరికేస్తున్నారు. దీనివల్ల ప్రజలకు దుమ్ము, కాలుష్యం, విపత్తులే మిగులుతున్నాయి" అని దుయ్యబట్టారు. అభివృద్ధి పేరుతో సాగుతున్న ఈ దోపిడీ వ్యవస్థలో పేదలు, కార్మికులు, మధ్య తరగతి ప్రజలు కేవలం గణాంకాలుగా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వంతెనలు కూలడం, రైలు ప్రమాదాలు జరగడం, పాఠశాలల పైకప్పులు పడిపోవడం వంటి సంఘటనలపై ప్రభుత్వం కేవలం పరిహారం, పబ్లిసిటీతో సరిపెట్టుకుంటోందని రాహుల్ ఎద్దేవా చేశారు. "ఫోటోలకు ఫోజులు ఇవ్వడం, సంతాపం తెలపడం తప్ప ప్రజల భద్రత పట్టడం లేదు. ప్రతిరోజు ఈ ప్రభుత్వం ఎవరో ఒకరి జీవితాన్ని చిదిమేస్తోంది. ఇది అభివృద్ధి ఇంజిన్ కాదు, విధ్వంసక ఇంజిన్" అని విమర్శించారు.

# అమెరికా, ఇజ్రాయిల్‌లు బెదిరింపులు మానుకోవాలి

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** అమెరికా, ఇజ్రాయిల్‌లు బెదిరింపులు మానుకోవాలని ఇరాన్ మరోసారి స్పష్టం చేసింది. ఇరాన్ పట్ల ఈ రెండు దేశాలు వ్యవహరిస్తున్న తీరు ఎంత మాత్రం సరికాదని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రి అబ్బాస్ అన్నారు. శుక్రవారం ఆయన ఇరాన్ అంతర్గత ఆందోళనలు, దేశ పౌరుల నిరసనలపై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న విమర్శలపై స్పందించారు. ఇరాన్‌లో పరిస్థితులు త్వరలోనే కంట్రలోకి వస్తాయన్నారు. టెహ్రాన్‌లో సిచ్యుయేషన్స్ దాదాపు నియంత్రణలోకి వచ్చేశాయన్నారు. అంతర్జాతీయ వేదికలపై తమ దేశ అంతర్గత విషయాలపై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న విమర్శఃలు భావ్యం కాదన్నారు. ఇరాన్‌లో జరుగుతున్న ఆందోళనలను అదుపు చేసేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే..నిరసనలపై అనవసరమైన కామెంట్స్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యాన్ని తాము సహించబోమని హెచ్చరించారు. యూఎస్ ఇబ్బందులు పెడితే యుద్ధానికి సిద్ధమేనని స్పష్టం చేశారు.




# ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరా..?

- సినిమా టికెట్ల రేట్ల పెంపుపై హైకోర్టు ఫైర్
- టికెట్ రేట్లు పెంచబోమని మంత్రి కూడా చెప్పారు
- అయినా రేట్లు ఎందుకు పెంచుతన్నారని ఆగ్రహం
- ప్రభుత్వం ఆలోచన మారడం లేదని అసహనం

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణలో భారీ బడ్జెట్ సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరల పెంపు వ్యవహారం మరోసారి న్యాయస్థానం మెట్లు ఎక్కింది. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన 'రాజాసాబ్' చిత్రానికి సంబంధించి టికెట్ రేట్లు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "పదే పదే రేట్లు ఎందుకు పెంచుతున్నారు? ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరా?" అంటూ ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. టికెట్ ధరల పెంపును సవాలు చేస్తూ ఓ న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. టికెట్ ధరల పెంపు లేదా బెనిఫిట్ షోలకు అనుమతి ఇచ్చే అధికారం కేవలం జిల్లా కలెక్టర్లకు, హైదరాబాద్‌లో పోలీస్ కమిషనర్‌కు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. కానీ హోంశాఖ కార్యదర్శి నేరుగా మెమోలు జారీ చేయడం చట్ట విరుద్ధమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిబంధనలను ఉల్లంఘించిన సదరు అధికారికి 5 లక్షల రూపాయల జరిమానా విధించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "టికెట్ ధరలు పెంచబోమని స్వయంగా సినిమాటోగ్రఫీ మంత్రి ప్రకటించారు. అయినా, ధరల పెంపునకు అనుమతిస్తూ తెలివిగా మెమోలు ఎందుకు జారీ చేస్తున్నారు? మెమో ఇచ్చే అధికారికి నిబంధనలు తెలియవా?" అని ప్రభుత్వ న్యాయవాదిని నిలదీసింది. ప్రభుత్వం తన ఆలోచనా విధానాన్ని మార్చుకోకపోవడంపై న్యాయమూర్తి మండిపడ్డారు. "మేము కూడా సినిమాలకు వెళ్తాం, మాకూ రేట్లు తెలుసు" అని వ్యాఖ్యానించిన న్యాయమూర్తి.. 20 ఏళ్ల క్రితం నగరం మొత్తం ఒకే ధర ఉండేదని, ఇప్పుడు ప్రతి సినిమాకు రేట్లు పెంచుతూ సామాన్యులపై భారం మోపడం సరికాదని పేర్కొన్నారు. ఈ వివాదంపై హైకోర్టు తదుపరి ఇచ్చే ఆదేశాలు ఇప్పుడు టాలీవుడ్‌లో ఉత్కంఠ రేపుతున్నాయి

# ఎస్టీ బిడ్డగా అవమానాలెదుర్కొన్న

**మొదటిపేజీ తరువాయి...**

పార్టీ కోసం 18 ఏళ్లు గోడ్డులాగ కష్టపడితే పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ఈ పద్దెనిమిదేళ్ల బీఆర్ఎస్ పార్టీ రాజకీయ ప్రస్తానంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. పార్టీకి చెందిన నాయకులు తనెంతో ఘోరంగా అవమానించినట్లు వివరించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణా రెడ్డి కనీస మర్యాద కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన బిడ్డనైన తనను మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి కుట్ర పూరితంగా రాజకీయంగా ఎదగకుండా అణచేశారన్నారు. తన విషయంలో ఏనాడు ప్రోటోకాల్ నిబంధనలను పాటించిన దాఖలు లేవన్నారు. తనకున్న ప్రోటోకాల్ ఆహ్వానం మేరకు సీఎం పర్యటనకు వెళితే ప్రెసిడెన్సియల్ సూట్ వద్ద తనను నువ్వేందుకు వచ్చావని వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని జగదీశ్వర్ రెడ్డి చెప్పడం తనను ఎంతగానో కుంగదీసిందన్నారు. జగదీశ్వర్ రెడ్డి నిర్వాహకం కారణంగానే తాను పుట్టెడు దుఃఖంతో అక్కడి నుంచి వెళ్లిపోవల్సి వచ్చిందన్నారు. జిల్లాలో రెడ్ల ఆధిపత్య రాజకీయాలకు ఇదే నిదర్శమన్నారు. అందుకే తాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ స్వావలంబన, సాధికారిత కోసం పని చేస్తున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. టీఆర్పీ చీఫ్ మల్లన్న సారథ్యంలో బీసీ రాజ్యాధికార సాధన కోసం పని చేయనున్నట్లు వివరించారు. రాజకీయ అవమానాలు లేని తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధాంతాలు, మల్లన్న ఆశయాలకు అనుగుణంగా పని చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్ని అగ్రకులాల ఆధిపత్యంలోనే ఉన్నాయని.. అందువల్ల ఆ పార్టీల్లోని బీసీ నేతలంతా ఆ పార్టీల నుంచి బయటకు రావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బిడ్డలంతా ఎన్ని రోజులున్న అగ్రవర్ణాల పార్టీల్లో కూలీలేనన్నారు. అందువల్ల సబ్బండ వర్గాల ఉమ్మడి ప్రయోజనాల కోసం ఏర్పడిన టీఆర్పీలో చేరడం వల్ల మెజార్టీ వర్గాలు రాజ్యాధికారాన్ని సాధించుకోగలవని బీకు నాయక్ ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు సమిష్టి పోరాటాలు చేయగల్గితేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. ఇందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీనే సరైన రాజకీయ వేదికన్నారు.

# రియల్ ఎస్టేట్ బ్రోకర్ చేతిలో రాష్ట్రం

**శనార్తి తెలంగాణ,హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ఒక రియల్ ఎస్టేట్ బ్రోకర్ చేతిలో చిక్కుకుందని,కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీల భూములపై కన్నేసి,యూనివర్సిటీలను నిర్వీర్యం చేయటానికి కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నందిన గర్ నివాసంలో కేటీఆర్‌తో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ( మనూ ) విద్యార్థులు సమావేశమయ్యారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలోనే ప్రజా అవసరాల కోసం మనూ 32 ఎకరాలు ఓఆర్ఆర్ కోసం, మరో 7 ఎకరాలు లింక్ రోడ్డు కోసం ఇచ్చిందని గుర్తుచేశారు.ఇప్పుడు మళ్ళీ 50 ఎకరాల భూమిపై రేవంత్ సర్కార్ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. "యూనివర్సిటీ భూములు ఖాళీగా ఉన్నవి కావు,అవి భవిష్యత్తు విస్తరణ కోసం ఉన్న ప్రణాళికాబద్ధమైన స్థలాలు.విద్యార్థుల పోరాటానికి మేము అండగా ఉంటాం,అవసరమైతే వారితో కలిసి ఢిల్లీ దాకా వెళ్లి పోరాడుతాం" అని స్పష్టం చేశారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ, హెచ్‌సీయూ భూములను కూడా వదలడం లేదని, హెచ్‌సీయూలో రూ.10 వేల కోట్ల కుంభకోణం జరుగుతున్నా కేంద్రం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేటీఆర్ విమర్శల వర్షం కురిపించారు.రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరిగే రాహుల్.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల వర్సిటీ భూములను అన్యాక్రాంతం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని కేటీఆర్ నిలదీశారు. "మైనార్టీలపై మీకున్న ప్రేమ ఇదేనా? విద్యార్థులను రోడ్డు మీదకు నెట్టడమేనా మీ మొహబ్బత్ కీ దుకాణం?" అని ఎద్దేవా చేశారు.రాహుల్ గాంధీని 'చేతగాని సన్యాసి'గా అభివర్ణిస్తూ, ఎన్నికల ముందు ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. అశోక్ నగర్‌లో ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఆందోళన చేస్తున్న నిరుద్యోగులపై పోలీసుల లాఠీచార్జిని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బట్టల దుకాణాలు,సినిమా థియేటర్ల ప్రారంభోత్సవాల్లో బిజీగా ఉంటూ,తనను ప్రశ్నిస్తున్న నిరుద్యోగులను అరెస్టులు చేయించి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పడం దుర్మార్గమని మండిపడ్డారు.నిరుద్యోగ యువతకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, కాంగ్రెస్ మోసాలను ఎండగడతామని ఆయన హామీ ఇచ్చారు.

# తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డికి ఊరట

- ఆయన నియామక ఉత్తర్వులు రద్దుకు హైకోర్టు నిరాకరణ
- యూపీఎస్సీ ప్రక్రియను 4 వారాల్లో పూర్తి చేయాలని ఆదేశం
- ఆ తర్వాతే కౌంటర్ దాఖలు చేయాలని వెల్లడి
- కేసు విచారణ వచ్చే నెల 05కు వాయిదా

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డికి హైకోర్టు ఊరటనిచ్చింది. ఆయన నియామక ఉత్తర్వులను రద్దు చేయాలన్న పిటిషన్‌ను ప్రస్తుతానికి తిరస్కరిస్తూ, యూపీఎస్సీ ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం శుక్రవారం ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇక ఆ ప్రక్రియ పూర్తయ్యాకే కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. డీజీపీ నియామకం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని పిటిషనర్ ధంగోపాల్‌రావు వాదించగా, ప్రభుత్వం యూపీఎస్సీకి అభ్యర్థుల జాబితా పంపినప్పటికీ సరైన కారణం లేకుండా తిరిగి పంపిందని అడ్వకేట్ జనరల్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రెండు వైపుల వాదనలు విన్న జస్టిస్ పుల్ల కార్తిక్ కేసు తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేశారు.

# ఉన్నవి మూడే కమిటీలు..!?

**మొదటిపేజీ తరువాయి...**

కీలక ప్రాంతాల్లో పార్టీ దాదాపు కనుమరుగు అయినప్పటికీ ఇప్పటికీ మూడు రాష్ట్ర కమిటీలు యాక్టివ్‌గా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఒడిశా–జార్ఖండ్–బెంగాల్ సరిహద్దు, జార్ఖండ్, బీహార్ రాష్ట్ర కమిటీలు కార్యకలాపాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయనే చర్చ ఉంది. ఈ కమిటీ కాస్తా యాక్టివ్‌గానే పని చేస్తున్నప్పటికీ..ఆ కమిటీల్లో పెద్దగా సభ్యులు లేనందున త్వరలోనే బలగాలు వాటికీ ఫుల్ స్టాప్ పెట్టొచ్చనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మావోయిస్టు పార్టీకి ఏమైనా ఉద్యమం మీద ఆశలు ఉంటే మాత్రం అది కేవలం దింపుడుకల్లం ఆశలు మాత్రమే అవుతాయనే ఓపినియన్స్ వ్యక్తమవుతున్నాయి.




# పౌరసత్వం పాక్‌ది..!

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** పాకిస్తాన్ పౌరసత్వం కల్గి ఉండి భారత్‌లో 30 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న మహిళా ఎంప్లాయిన్ బండారం బయటపడింది. తన అసలు పౌరసత్వాన్ని దాచి పెట్టిన ఫర్జానా అలియాస్ మహిరా అక్తర్‌పై ఉత్తరప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేశారు. 1979లో పాకిస్థాన్ వ్యక్తిని వివాహం చేసుకుని అక్కడి పౌరసత్వం పొందిన ఆమె, విడాకుల అనంతరం వీసాపై భారత్‌కు వచ్చి భారతీయురాలినని చెప్పుకుంటూ ప్రాథమిక విద్యా విభాగంలో ఉద్యోగం సంపాదించినట్లు దర్యాప్తులో తేలింది. నకిలీ పత్రాలతో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న విషయం వెలుగులోకి రావడంతో విద్యాశాఖ అధికారులు ముందుగా సస్పెండ్ చేసి, అనంతరం ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదు అందుకున్న యూపీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

# ఉక్రెయిన్‌పై ఒరెష్నిక్ ప్రయోగం.!

**మొదటిపేజీ తరువాయి...**

దానికి సమాధానంగానే ఈ 'ఒరెష్నిక్'ను ప్రయోగించామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది.

కేవలం ఒరెష్నిక్ మాత్రమే కాకుండా,రష్యా ఏకకాలంలో 36 క్షిపణులు 242 డ్రోన్లతో విరుచుకుపడింది.ఈ భీకర దాడుల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా,22 మందికి పైగా గాయపడ్డారు.ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు పలు నగరాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దాదాపు 5.5 లక్షల మంది ప్రజలు గడ్డకట్టే చలిలో చీకట్లోనే మగ్గుతున్నారు. ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థలు 226 డ్రోన్లను కూల్చివేసినప్పటికీ, మిగిలినవి భారీ నష్టాన్ని కలిగించాయని వార్తలొస్తున్నాయి. రష్యన్ భాషలో 'ఒరెష్నిక్' అంటే 'హేజెల్ నట్' చెట్టు అని అర్థం.ఇది ఒక మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి.గంటకు సుమారు 13,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. అణ్వాయుధాలను మోసుకెళ్లగలదు. ఒకేసారి పలు లక్ష్యాలను ఛేదించగలదు. ప్రస్తుతం ప్రపంచంలో ఈ క్షిపణిని అడ్డుకోగల రక్షణ వ్యవస్థ ఏ దేశం దగ్గరా లేదని రష్యా గర్వంగా చెబుతోంది. నాటో సరిహద్దులకు కేవలం 60 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రయోగం జరగడం ఇప్పుడు ఐరోపా దేశాల్లో వణుకు పుట్టిస్తోంది. ఈ దాడి ఉక్రెయిన్‌కు మాత్రమే కాకుండా యూరప్ మొత్తానికి పెనుముప్పు అని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి హెచ్చరించారు. శాంతి ఒప్పందాల గురించి చర్చలు జరుగుతున్న వేళ, రష్యా ఇలాంటి విధ్వంసకర ఆయుధాలను వాడటం యుద్ధం మరో ప్రమాదకరమైన దశకు చేరుకుందనడానికి సంకేతం. రష్యా తన మిత్రదేశమైన బెలారస్‌కు కూడా ఈ క్షిపణులను తరలించినట్లు సమాచారం ఉండటంతో అంతర్జాతీయ సమాజం ఆందోళన చెందుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఉక్రెయిన్ రష్యా వార్ మరింత ముదురే ఛాన్స్ ఉన్నట్టు వార్తలొస్తున్నాయి.